సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 19 । జనవరి । 2023



గొబ్బెమ్మల నిమజ్జనం

పవిత్ర పినాకిని తీరంలో బుధవారం గొబ్బెమ్మల వైభవంగా జరిగింది. ధనుర్మాసంలో గొబ్బెమ్మలు పెట్టి పూజిస్తారు. ఆ గొబ్బెమ్మలను కనుమ తర్వాత నిమజ్జనం చేయడం ఆనవాయితీ.

-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,221
3 శాతం జీఎస్టీతో	రూ.5,378
నవర (8 గ్రా)	రూ.43,024

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9 /20.9

జిల్లా వ్యాప్తంగా గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కనిష్టంగా ఉండడంతో చలి తీవ్రత పెరిగింది. గాలిలో తేమ 78 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

- రోజుకు 50 వేలకు తగ్గకుండా చర్యలు
- డ్వామా పీడీ వెంకట్రావ్



నెల్లూరు (పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకట్రావు మండల అధికారులను ఆదేశించారు. బుధవారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాకు అదనంగా 30 వేల పని దినాలను కేటాయించిందన్నారు. మార్చి 31వ తేదీలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు 50 వేల మంది కూలీలకు తగ్గకుండా పనులకు హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పని దినాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలకు సంబంధించి ఆధార్ కార్డులు అనుసంధాన ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను నూతన విధానంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధి పనుల కల్పన, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ తదితర అంశాలపై నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో బుధవారం రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు తెలిపారు. 1వ యూనిట్లో 445 మెగావాట్లు, 2వ యూనిట్లో 410 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు వెల్లడించారు. 3వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశామన్నారు.


21 నుంచి సీఎం కప్ క్రీడాపోటీలకు ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీల్లో పాల్గొనేందుకు నెల్లూరు జిల్లా క్రీడా జట్ల ఎంపికలు ఈ నెల 21, 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నామని సెట్నల్ సీఈఓ, క్రీడా పాధికార సంస్థ అధికారి పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన క్రీడావిధానంలో భాగంగా రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెలలో తిరుపతిలో జరగబోయే బాల,బాలికలకు ఈ పోటీలు నగరంలోని ఏసీ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి 31 డిసెంబర్ 2022 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఈ నెల 21న అథ్లెటిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 24న ఖోఖో, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, 25న ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఒరిజినల్స్ తీసుకుని ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని చీఫ్ కోచ్‌ను కలిసి తమ పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపిక కాబడిన జిల్లా జట్లకు రవాణా ఖర్చులు, క్రీడా దుస్తులు, ఇతర ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు పంపుతుందని తెలిపారు.

సోమశిలలో 71.363 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 71.363 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 860 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 1,150, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 306 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

బతుకుదాం.. గెలుద్దాం



కుటుంబ కలహాలు.. ఆర్థిక ఇబ్బందులు.. ప్రేమ విఫలం.. చెడు వ్యసనాలు.. తల్లిదండ్రుల మందలింపులు.. వెంటాడుతోన్న అనారోగ్యం.. మానసిక ఒత్తిళ్లు.. ఇలా కారణాలు ఏమైనా క్షణికావేశంలో అర్ధాంతరంగా ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిదిమేస్తున్నాయి. అయిన వారిని కన్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. సమస్య ఎదురైతే ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తు చేసుకుని క్షణం పాటు ఆలోచిస్తే జీవితాన్ని జయించవచ్చు. నిండు నూరేళ్లు సంతోషంగా గడిపేయవచ్చు.

▸ చిన్నచిన్న సమస్యలకే కుంగుబాటు

- అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు
- ఒక్క క్షణం ఆలోచిస్తే.. జీవితం ఆనందం
- క్షణికావేశంలో కఠిన నిర్ణయాలొద్దు
- మానసిక ధృడత్వం అవసరం అంటున్న వైద్యులు

నెల్లూరు (క్రైమ్): ప్రాణం ఎంతో విలువైనది. బంధాలు తరతరాల అనుబంధాలు. నిండు నూరేళ్ల జీవితాలను అంతలోనే అంతం చేసుకోవడం బాధాకరం. మరణం సమస్యకు పరిష్కారం కాదు. చిన్నచిన్న సమస్యలకే కుంగుబాటుకు గురికాకుండా.. ఒక్క క్షణం ఆలోచన చేస్తే జీవితం ఆనందమయంగా ఉంటుంది. క్షణికావేశంలో అర్ధాంతరంగా ప్రాణాలకు ముగింపు పలకడం ద్వారా కుటుంబ సభ్యులను రోడ్డున పడేసిన వారవుతారనే విషయాన్ని గ్రహించాలని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో గడిచిన 20 రోజుల్లో 14 మంది బలవన్మరానికి పాల్పడ్డారు.

- ➡ కుటుంబ కలహాలతో బోడిగాడితోటకు చెందిన పెయింటర్ మహేంద్ర పురుగు మందు తాగి ఆత్మహత్య.
- ➡ ఈ నెల 4న అనారోగ్యంతో అల్లుడు మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక వెంకురెడ్డి ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 10న మృతి.
- ➡ ఈ నెల 8న కుమారుడి మృతిని జీర్ణించుకోలేక తల్లి పద్మమ్మ ఆత్మహత్య.
- ➡ ఈ నెల 8న అర్ధరాత్రి తనను అవహేళన చేయడమే కాకుండా దాడి చేశారన్న మనస్థాపంతో సురేంద్రబాబు ఆత్మహత్య.
- ➡ ఈ నెల 9న దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో ఉరేసుకుని వెంగళరెడ్డి ఆత్మహత్య.
- ➡ ఈ నెల 12న తండ్రి సెల్ ఫోన్ కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య.
- ➡ ఈ నెల 16న భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో భర్త ఆత్మహత్య.
- ➡ ఈ నెల 17న భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లడంతో మానసిక వ్యథతో ఓ యువకుడు ఆత్మహత్య.

క్షణికావేశమే..

ప్రేమలోనో? పరీక్షల్లోనో? ఉద్యోగ సాధనలోనో? కుటుంబ నిర్వహణలోనో? వ్యాపారంలోనో విఫలమైతే అంతా కోల్పోయినట్లేనా? ఇవన్నీ జీవితంలో కొంత భాగం మాత్రమే. సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతోనే అనర్థాలు జరుగుతున్నాయి. జీవితం, సమస్యపై సరైన అవగాహన లేకపోవడమే కారణం. మనిషి జీవితంలో సుఖదుఃఖాలు, లాభానష్టాలు, జయాపజయాలు సహజం. సంతోషంలో పొంగిపోవడం, దుఃఖంలో కుంగిపోవడం తగదు. రెండింటిని సమానంగా స్వీకరించినప్పుడే ఒడిదొడుకులు ఎదురైతే ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనొచ్చు. మనం విఫలమైతే సమాజమేమి వెలివేయదు. ఉన్నతంగా ఎదిగేందుకు మరో అవకాశం ఇస్తుందన్న విషయాన్ని గుర్తించాలి.

యువతలో ప్రేమ విఫలం కావడం, తమ పెళ్లికి పెద్దల ఆమోదం లభించలేదని తొందర పాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలు, దంపతులు, స్నేహితుల నడుమ సంబంధాలు బెడిసి, తలెత్తిన విభేదాలు బలవన్మరణానికి దారి తీస్తున్నాయి.

ఒంటరి కుటుంబాలతో అనర్థాలు

ఒక్కప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఎవరికైనా సమస్య వస్తే పెద్దలు ఓదార్చి క్షణాల్లో ఆ సమస్యను పరిష్కరించేవారు. మేమున్నామని ధైర్యాన్ని భరోసా ఇచ్చేవారు. కాలంతో పాటు మానవ సంబంధాలు కూడా మారుతున్నాయి. పరుగుల ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మారుతున్న ఆలోచన విధానాలు కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా మారిపోతున్నాయి. గడిచిన రెండు.. మూడు తరాలుగా మానసిక స్థైర్యం కొరవడింది. ఇంకా ఇప్పటి తరం పిల్లలైతే మరింత సున్నిత మనస్కులుగా తయారవుతున్నారు. చిన్న సమస్యకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతున్నారు.

జిల్లాలో ఆత్మహత్యల గణాంకాలు

ఏడాది	మంది
2020	74
2021	85
2022	90

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 14 మంది

ఇలా ఎదుర్కోవచ్చు



ఆత్మహత్య భావనను ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఎదుర్కోవచ్చు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు భవిష్యత్‌ను చక్కగా ఊహించుకోవడం చక్కటి ఫలితాలను ఇస్తుంది. సానుకూల దృక్పథం, పుస్తక పఠనం, కౌన్సెలింగ్ ప్రక్రియ శక్తివంతంగా పని చేస్తాయి. ఆత్మహత్య భావన ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య మెలిగేలా చూసి, వారిలో ధైర్యం నింపాలి. జీవితంపై ప్రతికూల భావాలను వ్యక్తీకరించినప్పుడు కుటుంబ సభ్యులు తేలికగా తీసుకోకుండా మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– డాక్టర్ వి.సురేష్‌బాబు, మానసిక వైద్యనిపుణులు

సమస్యకు చావే పరిష్కారం కాదు



మానవ జీవితంలో ఒడిదొడుకులు సహజం. క్షణికావేశంలో నిర్ణయాలు తగదు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్య వచ్చినా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతోంది. జీవితం ఎంతో విలువైనది. ధైర్యంగా ముందుకు సాగాలి. చనిపోయి సాధించేది ఏమి ఉండదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం ఆనందంగా ఉంటుంది.

– కె.గురుప్రసాద్, పీడీ పీఎస్‌ఎం హైస్కూల్, జెండావీధి

వేగం కన్నా ప్రాణం మిన్న

- డీఆర్వో వెంకటనారాయణమ్మ



బ్యానర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్వో తదితరులు

నెల్లూరు (అర్బన్): వేగం కన్నా ప్రాణం మిన్న అనేది నినాదం మాత్రమే కాదని అందరూ ఆచరించాల్సిన విధానమని డీఆర్వో వెంకటనారాయణమ్మ తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న జాతీయ భద్రతా వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను, బ్యానర్లను కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్వో వెంకటనారాయణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాణం అనేది అత్యంత విలువైనదన్నారు. ప్రమాదంలో ఒక కుటుంబ పెద్ద మృతి చెందితే ఇక ఆ కుటుంబం అనాధవుతుందన్నారు. రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. ప్రధానంగా యువకులు అతివేగంగా బైక్‌ను నడుపుతున్నారని, మరి కొంత మంది సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బైక్‌లు నడుపుతున్నారని, ఇంకొందరి రహదారి నిబంధనలను ఉల్లంఘిస్తూ రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తుంటారని ఇలాంటి వారి వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో గతేడాది జరిగిన ప్రమాదాల్లో అందులో 373 మంది మృతి చెందారని 988 మంది అంగవైకల్యం పొందారని తెలిపారు. యుక్త వయస్సులోని పిల్లలు మరణిస్తే ఆయా తల్లిదండ్రుల రోదనను ఎవరూ తీర్చలేరన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఇలా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రాంతీయ రవాణాధికారి మురళీమోహన్, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్‌సుభాని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఇద్దరూ పగటి వేషగాళ్లే

- ఎన్నికల వరకు రకరకాల డ్రామాలు
- అప్పుడప్పుడొచ్చి రెచ్చగొట్టే మీటింగ్‌లు
- ప్రతీకారం తీర్చుకుంటామని ప్రగల్భాలు
- ప్రజలకేమిస్తామనే ప్రసంగాలే లేవు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ పగటి వేషగాళ్లుగా మారి రాష్ట్రంలో తిరుగుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. వయస్సు పైబడి చంద్రబాబుకు మతిభ్రమిస్తే.. సినిమాల్లో మాదిరి డైలాగ్స్‌తో పవన్ మైక్‌లు పట్టుకుని పిచ్చిపిచ్చిగా కేకలు వేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని పోతిరెడ్డిపాళెంలో మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పవన్‌కల్యాణ్ స్వయంగా చంద్రబాబు ఇంటికి వెళ్లి ఆయన కాళ్లు పట్టుకుని ఇచ్చే సూట్‌కేసు తీసుకుని అక్కడక్కడ సభలు పెట్టడం పిచ్చి పవన్‌కే చెల్లిందన్నారు. ఇద్దరూ ఏకమై జగన్‌ను ఓడిద్దామంటూ అరవడం తప్ప.. ఒక్కసీటు కూడా గెలవడం అసాధ్యమన్నారు. ఎంత మంది ఏకమైనా, చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో సారి పట్టాభిషిక్తుడు కావడం తథ్యమన్నారు. పవన్‌కల్యాణ్ కుటుంబం ఎంతో హుందాగా ఉంటుందన్నారు. ఆయన సోదరుడు మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి రాజకీయాల్లో ఉన్నంత కాలం ఎంతో హుందాతనం ప్రదర్శించారన్నారు. అలాంటి కుటుంబంలో పుట్టిన పవన్‌కల్యాణ్ పిచ్చోడిగా మారి ఆ కుటుంబ పరువును బజారున పడేస్తున్నారన్నారు. ఇటీవల ఒక సభ పెట్టి సభ్యత, సంస్కారం మరిచి తమ సీఎం, మంత్రులు, నాయకులను మాట్లాడిన మాటలు చూస్తే ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడికి ఉండాల్సిన లక్షణాలు లేవని అర్థమైందన్నారు. ఆయన సభకు జనం లేకపోవడంతో అన్ని జిల్లాల నుంచి జన సమీకరణ చేసుకుని నోటికి వచ్చిన పిచ్చి మాటలు మాట్లాడి వెళ్లిపోవడం చూస్తే పవన్‌కల్యాణ్‌ను ప్యాకేజీ కల్యాణ్, పావలా కల్యాణ్ అని అనక ఏమనాలన్నారు. పవన్‌కల్యాణ్ పిచ్చి ఏ స్థాయిలో ముదిరిందంటే.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు దేవుడిగా ప్రేమించే దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిని, రాష్ట్రమే కాకుండా దేశమే గర్వించేదగ్గ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం చూస్తే అర్థమవుతుందన్నారు. పవన్‌కల్యాణ్‌కు రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను పెట్టి పోటీలో నిలబెట్టి గెలిపించే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కనీసం నిన్ను కూడా గెలిపిస్తారనే నమ్మకం లేక చంద్రబాబు అండ చూసుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఏ నాడు నిన్ను ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చాడా అని చెప్పాలన్నారు. మా పార్టీ నేతలను తిట్టడం కంటే ముందు నీ పరిస్థితి ఏమిటో తెలుసుకోమని హితవు పలికారు. చంద్రబాబు ఇచ్చే 20 సీట్లకు 30 సీట్లకు అమ్ముడు పోతే ఇక రాజకీయ భవిష్యత్ కాదు కాదా రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదన్నారు. పవన్‌కల్యాణ్‌కు ఏ కోశానా రాజకీయ లక్షణాలు లేవన్నారు. చంద్రబాబు, పవన్‌కు ప్రజా సంక్షేమం కానీ, ప్రజా సమస్యలు కానీ పట్టవన్నారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, హరిప్రసాద్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, హైటెక్ ఫార్మా అధినేత వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

22న కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాతపరీక్ష



కోవూరు గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, సిబ్బందికి సూచనలిస్తున్న దృశ్యం

- జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలు
- పరీక్షకు హాజరు కానున్న 20,952 మంది అభ్యర్థులు
- స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): పోలీసు కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష ఈ నెల 22వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో 20,952 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. నెల్లూరు పరిధిలోని 44 పరీక్ష కేంద్రాల్లో 16,532, కావలి పరిధిలోని 8 పరీక్ష కేంద్రాల్లో 4,420 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే ఎస్పీ సీహెచ్ విజయారావు పోలీసు అధికారులతో పాటు కో–ఆర్డినేటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలతో పాటు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఎస్పీ కోవూరు గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, కావలిలోని విట్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పని తీరులను పరిశీలించారు. ఆర్మ్‌డ్ గార్డ్‌ను ఏర్పాటు చేయాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ డి.హిమవతి, నెల్లూరు రూరల్, కావలి డీఎస్పీలు పి. వీరాంజనేయరెడ్డి, వెంకటరమణ, ఎస్‌బీ, కోవూరు ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, రామకృష్ణారెడ్డి, కోవూరు ఎస్‌ఐ డి.వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు తదితరులున్నారు.

రూ.42 లక్షల నగదు పట్టివేత

- రైల్వేస్టేషన్‌లో బ్యాగుల తనిఖీల్లో పట్టుబడిన వైనం
- చెన్నైకు తీసుకెళ్తున్న బంగారు వ్యాపారి వద్ద స్వాధీనం
- నగదుకు లెక్క లేకపోవడంతో ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగింత



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు

నెల్లూరు (క్రైమ్): ఎలాంటి బిల్లులు లేకుండా బ్యాగ్ నిండా నగదుతో రైల్లో ప్రయాణిస్తున్న ఓ బంగారు వ్యాపారిని నెల్లూరు రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌లో ఉన్న రూ.42 లక్షల నగదును సీజ్ చేశారు. రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో విపిన్‌కుమార్‌జైన్ నివాసం ఉంటూ మండపాలవీధిలో శ్రీబాలాజీగోల్డ్ పేరిట బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన చెన్నైలో బంగారు కొనుగోలు చేసేందుకు బుధవారం నెల్లూరు రైల్వేస్టేషన్ నుంచి పినాకిని ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరారు. నేర నియంత్రణలో భాగంగా రైల్వే పోలీసులు రైల్వే క్రైమ్ పార్టీ సిబ్బంది రైల్లో తనిఖీలు చేపట్టారు. విపిన్‌కుమార్‌జైన్ అనుమానాస్పదంగా ఉండడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా రూ.42 లక్షల నగదును గుర్తించి స్టేషన్‌కు తరలించారు. నగదుకు సంబంధించిన బిల్లులు, ఇతర ఆధారాలు చూపించాలని కోరగా ఎలాంటి బిల్లులు లేవని వ్యాపారి చెప్పడంతో అనామత్తు నగదుగా గుర్తించి సీజ్ చేశారు. ఆ నగదును ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. తనిఖీల్లో పాల్గొన్న రైల్వే ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసాచారి, గూడూరు, నెల్లూరు రైల్వే ఎస్‌ఐలు కె.కొండపనాయుడు, ఎస్. హరిచందన, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ, సిబ్బంది లావణ్య, కుమార్‌రాజ, పెంచలయ్య, ఆనంద్, రమేష్, సురేష్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి అభినందించి రివార్డులు ప్రకటించారని డీఎస్పీ వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ కె.శ్రీనివాసాచారి, నెల్లూరు, గూడూరు రైల్వే ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.


జనసంద్రంగా మారిన పెన్నాతీరం


పూజల్లో పాల్గొన్న అరుణమ్మ, అనిల్, ఎమ్మెల్సీ అభ్యర్థులు


దేవతామూర్తులను దర్శించుకుంటున్న ప్రజలు

సంప్రదాయం.. గొబ్బెమ్మల నిమజ్జనం

ఏటి పండగ సందర్భంగా నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట సమీపంలో పెన్నాతీరం బుధవారం జనసంద్రమైంది. అనేకమంది కుటుంబాలతో తరలివచ్చి సందడి సందడిగా గడిపారు. పండగలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దేవతామూర్తులను పవిత్ర పినాకినీ తీరంలో కొలువుదీర్చారు. మహిళలు తమ ఇళ్లలో పవిత్రంగా పూజించిన గొబ్బెమ్మలను నదిలో నిమజ్జనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – నెల్లూరు(బృందావనం)


గొబ్బెమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


ఆటలాడుతున్న చిన్నారులు

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

నెల్లూరు(టౌన్): విద్యార్థులను మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని, ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిందన్నారు. ప్రతి బడిలో 6 నుంచి 12 తరగతుల్లో 20 మంది విద్యార్థులతో ఒక ఉపాధ్యాయుడు ప్రహరీ క్లబ్‌లు పెట్టాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ నోడల్ హెడ్‌గా ఉంటారని తెలియజేశారు. ఫిజికల్ టీచర్ లేకపోతే ఎవరైనా టీచర్‌ను నియమించే అధికారం ప్రధానోపాధ్యాయుడికి ఉంటుందని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నెల్లూరు(క్రైమ్): విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరులోని శివాజీనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ (35)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, అన్న మాలిక్, తమ్ముడు ఖాదర్ బాషా ఉన్నారు. మస్తాన్ తన తమ్ముడితో కలిసి తెలుగుగంగ కాలనీ శివాజీనగర్‌లో జీఎం వాటర్ సర్వీస్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మస్తాన్ తమ్ముడికి ఫోన్ చేసి వాటర్ సర్వీస్ కోసం వాహనాలు అధికంగా ఉన్నాయని త్వరగా రావాలని చెప్పాడు. ఈక్రమంలో తను వాహనాలకు వాటర్ సర్వీస్ చేస్తుండగా మస్తాన్ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కుప్పకూలాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న ఖాదర్‌బాషా మస్తాన్ చేతికి గాయమై ఉండడంతో స్థానికుల సాయంతో అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మస్తాన్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఖాదర్‌బాషా వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్
(Sponsored by Canara Bank)

ప్రాంతీయ కార్యాలయం, వెంకటరామాపురం, డి.నెం.15/496, వార్డు నెం.15, నెల్లూరు, సెల్‌నెం.94901 58028


దిగువ కనబరచిన వ్యక్తులు మా బ్యాంకు శాఖల నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణములు గడువు మీరిన తరువాత కూడా నోటీసులు పంపినా అప్పు చెల్లించియుండలేదు. సదరు నోటీసులు వారికి పంపినప్పటికీ స్పందించనందున/నోటీసు వారికి చేరక వాపసు వచ్చినందున వారి బకాయిలు రాబట్టుకొనుటకు బ్యాంకు నిబంధనలను అనుసరించి వారు తాకట్టు పెట్టిన బంగారు నగలను వేలం వేయుటకు నిర్ణయించినారు. **తేది. 30-01-2023 సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, నెల్లూరు మెయిన్ శాఖ, వెంకటరామాపురం, పూలే బొమ్మ దగ్గరలోని** మా బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలము ద్వారా సదరు నగలు విక్రయించి అప్పులు జమచేయబడును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.50,000/- ధరావత్తు **తేది.30-01-2023 మధ్యాహ్నం 1.00 గంటలలోగా** చెల్లించి పేర్లు నమోదు చేసుకొనవలెను. వేలం పాట పాడిన వారు వెంటనే పూర్తి సైకము చెల్లించి సదరు నగలను తీసుకుని వెళ్ళవలెను. ఎటువంటి కారణము తెలుపకనే వేలం వాయిదా వేయుటకుగాని పూర్తి/పాక్షికంగా రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. ప్రకటన ఖర్చులు ఖాతాదారులే భరించవలెను.

క్ర.సం.	బ్యాంకు శాఖ	ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు	బరువు గ్రాంలో
1	గండిపాళెం	91159120819	శ్రీ మొప్పె చిన్నయ్య, తండ్రి : కొండయ్య, కొండారెడ్డిపల్లి	21.8
2	గుడిపాడు	91150860115	శ్రీమతి మద్దిలి సునీత, భర్త : హరికృష్ణ, గుడిపాడిపాళెం	6.4
3	జగదేవిపేట	91119550895	శ్రీ బాలకొమ్మ అశోక్, తండ్రి : రామయ్య, పున్నూరు	35.00
4	కలువాయి	91130826190	శ్రీ మదమంచి వెంకటేశ్వర్లు, తండ్రి : వెంకటరత్నం, చిపినపి	109.1
5	కలువాయి	91156632699	శ్రీ గోనుగుంట వెంకటేశ్వర్లు, తండ్రి : వెంగయ్య, బాలాజీరావు పేట	17.3
6	కలువాయి	91127596852	శ్రీ గోనుగుంట వెంకటేశ్వర్లు, తండ్రి : వెంగయ్య, బాలాజీరావు పేట	65.73
7	వేగూరు	91147778577	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	39
8	వేగూరు	91147776013	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	35.4
9	వేగూరు	91147771117	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	25.6
10	వేగూరు	91147768138	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	32.9
11	వేగూరు	91147766505	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	17.5
12	వేగూరు	91146179358	శ్రీ చింతల ఏడుకొండలు, తండ్రి : నరసయ్య, వేగూరు	16
13	వెంకటగిరి	91141808601	శ్రీమతి జమ్మ రఘువతమ్మ, భర్త: వెంకట సుబ్బయ్య, బూసపాలెం	23.7

సం/-రీజనల్ మేనేజర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, నెల్లూరు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్) :	118
లేయర్ (లైవ్) :	100
బ్రాయిలర్ చికెన్ :	208
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	230
లేయర్ చికెన్ :	170

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.37
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.7

అల్లుడి చేతిలో అత్త హతం

- మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని..
- బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో ఘటన
- పరారీలో నిందితుడు


సుబ్బమ్మ మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని అత్తను అల్లుడు రోకలిబండతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో బుధవారం జరిగింది. ఎస్సై వీర ప్రతాప్, కుటుంబసభ్యులు, స్థానికుల కథనం మేరకు.. వవ్వేరుకు చెందిన గద్దె సుబ్బమ్మ (70) కుమార్తె కొండమ్మకు కలిగిరి మండలం జిర్రావారిపాళేనికి చెందిన గుంటపల్లి నారాయణతో ఇరవై సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి రాజ్‌కుమార్ అనే కుమారుడు ఉన్నాడు. నారాయణ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా అప్పులు చేసి తాగుతుంటాడు. నాలుగు సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. కొండమ్మ తన కుమారుడితో కలిసి వవ్వేరుకు వచ్చేసింది. తల్లి వద్దే కూలి పనులు చేస్తోంది. ఇటీవల సంక్రాంతి సందర్భంగా నారాయణను ఇంటికి పిలవాలని కుమార్తెకు సుబ్బమ్మ చెప్పింది. ఈక్రమంలో అతను వవ్వేరుకు చేరుకున్నాడు. అందరూ కలిసి పండగ చేసుకున్నారు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని నారాయణ నిత్యం తన భార్యను అడిగేవాడు. ఆమె నగదు ఇచ్చేందుకు నిరాకరించేది.

అందరూ వెళ్లాక..

బుధవారం కొండమ్మ వ్యవసాయ పనులకు, ఆమె కుమారుడు రాజ్‌కుమార్ పనినిమిత్తం బయటకు వెళ్లారు. ఆ సమయంలో మద్యం తాగేందుకు డబ్బు కావాలని నారాయణ అత్త సుబ్బమ్మను అడగ్గా.. ఇచ్చేందుకు ఆమె నిరాకరించింది. మళ్లీ అత్త వద్ద ఉన్న బంగారు ఉంగరాన్ని ఇవ్వాలని నారాయణ అడగ్గా.. దీనికి కూడా ఆమె ఒప్పుకోలేదు. కాసేపటికి సుబ్బమ్మ మంచంపై నిద్రిస్తుండగా నారాయణ ఇంట్లో ఉన్న రోకలిబండతో ఆమె తల, ముఖంపై దారుణంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే అతను అత్త చేతికి ఉన్న పచ్చరాయి ఉంగరం, చెవులకు ఉన్న బంగారు కమ్మలను తీసుకుని ఇంటి తలుపులు వేసి పరారయ్యాడు. సాయంత్రం ఇంటికొచ్చిన కొండమ్మ మంచంపై రక్తపుమడుగులో చనిపోయి ఉన్న తల్లిని చూసి పెద్దగా కేకలు వేసింది. స్థానికులు వెంటనే అక్కడి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. కొండమ్మ భర్తపై ఫిర్యాదు చేయడం, అతను పరారీలో ఉండడంతో పోలీసులు హత్య కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఘటనా స్థలాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రాణం తీసిన చలిమంట

- రెండురోజుల క్రితం తల్లి, ఇద్దరు కుమార్తెలకు గాయాలు
- చికిత్స పొందుతూ చిన్నకుమార్తె మృతి
- గోప్యంగా ఉంచిన పోలీసులు


లహరిశ్రీ, శ్రీవర్ష (ఫైల్)

వెంకటాచలం: చలి కాచుకునేందుకు వేసిన మంట ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మంటలు అంటుకుని ఇద్దరు చిన్న పిల్లలు, కాపాడేందుకు వెళ్లిన తల్లి గాయపడ్డారు. రెండేళ్ల వయసున్న చిన్నకుమార్తె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయం బుధవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో బయట పడింది. అయితే పోలీసులు గోప్యంగా ఉంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కంటేపల్లి గ్రామానికి చెందిన మానికల రవికృష్ణ పెయింట్ పని చేస్తుంటాడు. అతడికి భార్య నాగభూషణమ్మ, కుమార్తెలు లహరిశ్రీ, శ్రీవర్ష (2) ఉన్నారు. ఈనెల 16వ తేదీన తెల్లవారుజామున నాగభూషణమ్మ థిన్నర్ వాడి ఇంటి ముందు చలిమంట వేసింది. కుమార్తెలు చలి కాచుకుంటుండగా ఆమె సమీపంలో ముగ్గు వేస్తోంది. రవికృష్ణ కూడా అక్కడ ఉన్నాడు. కాగా మంట ఆరిపోతుండడంతో లహరిశ్రీ థిన్నర్ పోసింది. దీంతో ఒక్కసారిగా మంటలు పెద్దఎత్తున చెలరేగి లహరిశ్రీ, శ్రీవర్ష శరీరానికి అంటుకున్నాయి. తల్లి చూసి వారిని కాపాడేందుకు ప్రయత్నించింది. ఈక్రమంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. రవికృష్ణ, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ముగ్గురిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీవర్ష మంగళవారం సాయంత్రం మృతిచెందింది. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. అయితే కొందరు వ్యక్తులు బాధిత గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలన్న లక్ష్యంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టగా వైరలైంది. కాగా ఇది పెద్ద విషయం కాదన్నట్లుగా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పత్రికలు, మీడియాకు తెలియజేసి ఉంటే బాధితులకు సాయం అందేదని చెబుతున్నారు. చలి కాచుకునేందుకు వేసిన మంట చిన్నారిని బలి తీసుకోవడం, మరో బాలిక, తల్లి గాయాలపాలవడంతో కంటేపల్లి గిరిజన కాలనీలో విషాదం నెలకొంది.